

విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



ఢిల్లీలో ఇండియా కూటమి నిరసన..
పోలీసులు కిందపడేశారన్న ప్రియాంకగాంధీ

సంపుటి:-01, సంచిక:-133, గురువారం 08-10-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

ఓటును కాపాడండి
దేశాన్ని కాపాడండి

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ఇండియా కూటమి ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో మిత్రపక్షాల నాయకులతో నిర్వహించిన "ప్రజాస్వామ్య పరిరక్షణ వారోత్సవం -- ఓటును కాపాడండి, దేశాన్ని కాపాడండి" కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు.

గృహ వినియోగదారులకు 24 గంటలూ నిరంతర విద్యుత్ సరఫరా

- విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్ల నుంచి దాదాపు 20 వేల మెగావాట్లకు పెరిగింది
- జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా
- థర్మల్ విద్యుత్‌తో రాత్రివేళ పీక్ డిమాండ్‌ను అధిగమిస్తున్నాం
- పులిచింతల జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడంతో పాటు జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పటికీ ప్రజలకు ఎక్కడా విద్యుత్ కోతలు

ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి చేసి
లబ్ధిదారుల చేతికి తాళాలిస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- ఇందిరమ్మ టవర్స్ వేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- 5,218 మంది అర్హుల నుంచి లక్కీ డ్రా.. 480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు



క్యూర్ పరిధిలో తొలివిడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా,

ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

- కేసీఆర్ కుటుంబానికి నోటీసులు!
- ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- సర్వేలో 45 ఎకరాల భూమి తేడా ఉన్నట్టు గుర్తింపు
- రికార్డులు సమర్పించాలని కేసీఆర్ కుటుంబానికి నోటీసులు
- అదే భూమిలో అమరవీరుల కాలనీ నిర్మాణానికి ఆదేశం
- జూన్ 2 నాటికి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచన



సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల భూముల సర్వే నివేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎర్రవల్లిలోని సర్వే

చర్చలకు సిద్ధంగా లేమని తేల్చి చెప్పిన కిమ్ ప్రభుత్వం

- ఒక్క మిల్లీమీటర్ మా భూభాగంలోకి వచ్చినా తీవ్ర పరిణామాలు తప్పవు: దక్షిణ కొరియాకు ఉత్తర కొరియా హెచ్చరిక
- దక్షిణ కొరియాకు ఉత్తర కొరియా తీవ్ర హెచ్చరిక జారీ
- తమ భూభాగంలోకి వస్తే తక్షణ ప్రతిచర్య ఉంటుందని స్పష్టీకరణ
- సరిహద్దులో ల్యాండ్‌మైన్ పేలుళ్ల ఘటనతో పెరిగిన ఉద్రిక్తతలు

పేలుళ్ల ఆరోపణలను ఖండించిన ఉత్తర కొరియా



ఇరు కొరియాల మధ్య మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు రాజుకున్నాయి. తమ భూభాగంలోకి ఒక్క మిల్లీమీటర్ అడుగుపెట్టినా తక్షణమే, - మిగతా 2 లో

పోలీసుల అదుపులో రాహుల్ గాంధీ, ప్రియాంక

- ఢిల్లీ ఆకాశవాణి భవన్ వద్ద ఉద్రిక్తత
- సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విపక్షాల భారీ నిరసన
- పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయానికి ఇండియా కూటమి ర్యాలీ
- బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన రాహుల్ గాంధీ
- ఆకాశవాణి భవన్‌లో బైఠాయించి కొనసాగుతున్న ఆందోళన



దేశ రాజధాని ఢిల్లీ మంగళవారం విపక్షాల ఆందోళనతో దద్దరిల్లింది. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు, హైడ్రామాకు దారితీసింది. కాంగ్రెస్ అగ్రనేతలు - మిగతా 2 లో

27 లక్షల మంది విద్యార్థులకు
వేడివేడి అల్పాహారం



- ఇది ఉచితం కాదు.. రాష్ట్ర భవిష్యత్తు మానవ వనరులపై పెట్టుబడి
- రూ.9.6 కోట్లతో మునగాలలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్
- 1,020 పాఠశాలల్లోని 60 వేల మంది విద్యార్థులకు ఒకే కిచెన్ నుంచి అల్పాహారం

ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు అతి కొద్దిమంది నేతల్లో మోదీ ఒకరు!



- ప్రభుత్వాధినేతగా నిరంతరాయంగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీ
- సిక్కిం మాజీ సీఎం పవన్ చామ్లింగ్ రికార్డును అధిగమించిన ప్రధాని
- ఒడిశాలో నవీన్ పట్నాయక్, బెంగాల్‌లో జ్యోతిబసు పేరిట సుదీర్ఘ పాలన రికార్డులు
- ప్రపంచంలో లీ క్వాన్ యూ, హున్ సేన్ వంటి నేతల సరసన చేరిన మోదీ
- ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంలో ఈ ఘనత సాధించడం విశేషం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ - మిగతా 2 లో

ఎట్టి పరిస్థితుల్లోనూ
జాప్యం వద్దు



- రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు
- నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- గత నెలలో రూ.1,345 కోట్ల పనులు జరిగాయని అధికారులు వెల్లడి
- ఔటర్ రింగ్ రోడ్డుపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం
- ప్రస్తుతం 41 వేల మంది కార్మికులతో కొనసాగుతున్న పనులు - మిగతా 2 లో

విజన్ పక్షం

ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు.. అతి కొద్దిమంది నేతల్లో మోదీ ఒకరు!

మొదటిపేజీ తరువాయి – ప్రస్థానంలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2001 అక్టోబర్ 7న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు, ప్రధానమంత్రిగా కొనసాగుతూ.. ప్రభుత్వ అధినేతగా నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. పాతికేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిరంతరాయంగా అధికారంలో కొనసాగిన అతికొద్ది మంది ప్రపంచ నేతల జాబితాలో ఆయన స్థానం సంపాదించారు. భారతదేశంలో, ఎన్నికైన ప్రభుత్వానికి అధిపతిగా సుదీర్ఘకాలం పనిచేసిన రికార్డును మోదీ ఇప్పటికే అధిగమించారు. గతంలో ఈ రికార్డు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ నేత అయిన చామ్లింగ్ డిసెంబర్ 1994 నుంచి మే 2019 వరకు మొత్తం 24 సంవత్సరాల 165 రోజుల పాటు సీఎంగా పనిచేశారు. దేశంలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారిలో ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన జ్యోతిబసు కూడా ఉన్నారు. బిజూ జనతాదళ్ నాయకుడు నవీన్ పట్నాయక్ మార్చి 2000 నుంచి జూన్ 2024 వరకు 24 సంవత్సరాల 99 రోజుల పాటు సీఎంగా సేవలందించారు. ఆయన తన స్వచ్ఛమైన ఇమేజ్, విపత్తు నిర్వహణ సామర్థ్యం, మహిళా సాధికారత కార్యక్రమాలతో ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక, సీపీఎం నేత జ్యోతిబసు జూన్ 1977 నుంచి నవంబర్ 2000 వరకు 23 సంవత్సరాల 137 రోజుల పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలో అమలు చేసిన భూ సంస్కరణలు, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. అంతర్జాతీయంగా చూస్తే, సింగపూర్ తొలి ప్రధాని లీ క్వాన్ యూ 1959 నుంచి 1990 వరకు ఏకంగా 31 ఏళ్లు నిరంతరాయంగా అధికారంలో ఉన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో సుదీర్ఘ పాలనకు ఆయనను ఒక ఆధునిక కొలమానంగా పరిగణిస్తారు. ఆయన నాయకత్వంలో సింగపూర్ పేదరికం నుంచి ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాల్లో ఒకటిగా ఎదిగింది. కంబోడియాలో హున్ సేన్ 1985 నుంచి 2023 వరకు ప్రధానిగా పనిచేసి, ఆధునిక ప్రపంచంలో ఎక్కువ కాలం పనిచేసిన నేతల్లో ఒకరిగా నిలిచారు. మలేషియాలో మహతీర్ మొహమ్మద్ రెండు పర్యాయాల్లో కలిపి 24 ఏళ్లకు పైగా ప్రధానిగా పనిచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత పోటీతత్వ ప్రజాస్వామ్యంలో వరుస ఎన్నికల విజయాలతో ఈ 25 ఏళ్ల మైలురాయిని చేరుకోవడం మోదీ విషయంలో ఒక ప్రత్యేకతగా నిలుస్తోంది. “వికసిత భారత్” లక్ష్యంతో ఆయన ప్రస్థానం ఇంకా కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న అనేక మంది నేతలు వివాదాస్పద పాలకులుగా ముద్రపడగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికవుతూ మోదీ ఈ ఘనత సాధించడం గమనార్హం.

ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

మొదటిపేజీ తరువాయి – నంబర్ 325లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 388 ఎకరాలు ఉండగా, క్షేత్రస్థాయి సర్వేలో కేవలం 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. దీంతో గల్లంతైన 45 ఎకరాల భూమి ఎక్కడుందో వెంటనే గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ భూమిని గుర్తించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాలకు సర్వే నోటిఫికేషన్లు జారీ చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, సంబంధిత రెవెన్యూ రికార్డులను సమర్పించాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేశారు. సర్వే నంబర్ 325లోని భూమిని అమరవీరుల కుటుంబాల కోసం కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్కడ ‘అమరవీరుల కాలనీ’ నిర్మించి, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. ఈ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగిస్తూ, జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ జరపాలని గతంలో అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాల మేరకే రెవెన్యూ అధికారులు ఇటీవలి వారాల్లో ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

చర్చలకు సిద్ధంగా లేమని తేల్చి చెప్పిన కిమ్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి – అత్యంత శక్తిమంతంగా ప్రతిఘటిస్తామని ఉత్తర కొరియా మంగళవారం దక్షిణ కొరియాను తీవ్రంగా హెచ్చరించింది. సరిహద్దులో ఇటీవల జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడు ఘటనపై దక్షిణ కొరియా తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో ఈ హెచ్చరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సెప్టెంబర్ 21న ఇరు దేశాల సరిహద్దులోని సైనిక రహిత ప్రాంతం (ఇఫ్జీ) దక్షిణ భాగంలో జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడులో ఇద్దరు దక్షిణ కొరియా సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ పేలుళ్లకు ఉత్తర కొరియానే కారణమని, వారు ఉద్దేశపూర్వకంగానే మైన్‌లను అమర్చారని దక్షిణ కొరియా సైన్యం దర్యాప్తులో పేర్కొంది. దీనికి ప్రతిస్పందనగా, ఐక్యరాజ్యసమితి కమాండ్ (ఖచీజ) సహకారంతో దక్షిణ కొరియా ఆ ప్రాంతంలో మైన్‌లను తొలగించే ఆపరేషన్‌ను చేపట్టింది. దీన్ని ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాత్మక చర్యగా దక్షిణ కొరియా రక్షణ మంత్రి కాంగ్ షిన్-చుల్ అభివర్ణించారు. ఈ పరిణామాలపై ఉత్తర కొరియా విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. ల్యాండ్‌మైన్ పేలుడుతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆ మేరకు ఆరోపణలను పూర్తిగా ఖండించింది. దక్షిణ కొరియా ఉద్దేశపూర్వకంగా కట్టుకథ అల్లి, తమపై నిందలు వేస్తోందని, అంతర్జాతీయంగా తమ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. “ఒకవేళ దక్షిణ కొరియా సైనికులు సరిహద్దు రేఖను దాటి మా భూభాగంలోకి ప్రవేశిస్తే, మా సరిహద్దు దళాలు తక్షణమే శక్తిమంతమైన ప్రతిచర్య తీసుకుంటాయి” అని ఆ ప్రకటనలో హెచ్చరించింది. ఈ వివాదానికి ప్రధాన కారణం సరిహద్దు రేఖ (వీఋా)పై స్పష్టత లేకపోవడమేనని వాదనలు వినిపిస్తున్నాయి. 1953 యుద్ధ విరమణ ఒప్పందం సమయంలో ఏర్పాటు చేసిన 1,292 సరిహద్దు గుర్తింపు చిహ్నాలలో చాలా వరకు కాలక్రమేణా దెబ్బతినడంతో, ప్రస్తుతం కేవలం 200 మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు రేఖపై నెలకొన్న అనిశ్చితిని పరిష్కరించడానికి చర్చలు జరపాలని దక్షిణ కొరియా ప్రతిపాదించినప్పటికీ, అందుకు తాము సిద్ధంగా లేమని ఉత్తర కొరియా స్పష్టం చేసింది. తమ సార్వభౌమాధికారానికి సంబంధించిన విషయాల్లో చర్చలకు తావులేదని, బల ప్రయోగంతోనే తమ భూభాగాన్ని కాపాడుకుంటామని తేల్చి చెప్పింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

పోలీసుల అదుపులో రాహుల్ గాంధీ, ప్రియాంక



మొదటిపేజీ తరువాయి – రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం ‘నిర్వాచన్ సదన్’ వైపు నిరసన ర్యాలీగా బయలుదేరారు. అయితే, ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ బారికేడ్లు ఎక్కి, చేతిలో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ తన నిరసనను తీవ్రతరం చేశారు. అనంతరం ఇతర నేతలతో కలిసి రోడ్డుపైనే బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఢిల్లీ పోలీసులు రంగప్రవేశం చేసి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, శివసేన (యూబీటీ) సహా పలువురు విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని బస్సుల్లోకి ఎక్కించారు. ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత లోపించిందని, అవకతవకలు జరుగుతున్నాయని విపక్షాలు గత కొద్ది వారాలుగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని కూడా వార్తలు వచ్చాయి. దీనిపై రాహుల్ సోషల్ మీడియాలోనూ స్పందించారు. “జ్ఞానేశ్, ఇక ముగిసింది. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది” అని ఆయన ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.

గృహ వినియోగదారులకు 24 గంటలూ నిరంతర విద్యుత్

మొదటిపేజీ తరువాయి – లేకుండా నిరంతర సరఫరా అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పులిచింతల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ఇప్పటివరకు జరిగిన ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, అధికారులు ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఇదే సమయంలో రాష్ట్రంలో పీక్ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం దాదాపు 20 వేల మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గి, జలవిద్యుత్ ఉత్పత్తి సుమారు 4 వేల మెగావాట్లు తగ్గిందన్నారు. డిమాండ్ పెరుగుదల, జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గుదల కలిపి సుమారు 8 వేల మెగావాట్ల అదనపు భారం ఏర్పడినప్పటికీ విద్యుత్ సంస్థలు సమర్థంగా పనిచేస్తూ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నాయని వివరించారు.

జలవిద్యుత్ కేంద్రాలన్నీ ఉత్పత్తికి సిద్ధం

రాష్ట్రంలోని అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో యంత్రాలు, యూనిట్లు పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అవసరమైన స్థాయిలో నీటి లభ్యత



లేకపోవడం వల్లే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గిందని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు, ఎండల తీవ్రత ఇందుకు ప్రధాన కారణాలన్నారు. “ఎన్ని సవాళ్లు ఎదురైనా గృహ వినియోగదారులకు 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం. ప్రజలు విద్యుత్ సరఫరాపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు” అని డిప్యూటీ సీఎం తెలిపారు. రాత్రి వేళల్లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా అధిగమిస్తున్నామని చెప్పారు. కర్ణాటకలో పీక్ విద్యుత్ డిమాండ్ సుమారు 20 వేల మెగావాట్లు ఉండగా తెలంగాణలోనూ ప్రస్తుతం అదే స్థాయికి చేరిందని, ఆంధ్రప్రదేశ్‌లో పీక్ డిమాండ్ సుమారు 12 వేల మెగావాట్లుగా ఉందని పేర్కొన్నారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి

రాబోయే రోజుల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోతే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. తదుపరి వర్షాకాలం వరకు అందుబాటులో ఉన్న నీటిని మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలకు జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిన పరిస్థితుల్లోనూ నిరంతర విద్యుత్ సరఫరా కోసం శ్రమిస్తున్న జెన్‌కోతో పాటు విద్యుత్ సంస్థల సిబ్బందిని డిప్యూటీ సీఎం అభినందించారు.

27 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయాన్నే టిఫిన్ అందించే పథకానికి సంబంధించిన సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అలాగే రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున కేటాయించి, అత్యాధునిక సదుపాయాలతో పాఠశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన సుమారు 2,600 మంది విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనభ్యసించేలా ఈ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని వివరించారు.

ఓటును కాపాడండి.. దేశాన్ని కాపాడండి



మొదటిపేజీ తరువాయి – ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకొని పెద్ద సంఖ్యలో ప్రజల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అత్యంత విలువైన హక్కు అని, ఓటు హక్కును కాపాడుకోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమేనని మంత్రి అన్నారు. ఎన్నికల జాబితాల్లో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా పారదర్శకమైన ప్రక్రియ ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల మార్పులు, తొలగింపుల విషయంలో ప్రజలకు పూర్తి స్పష్టత ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ నాయకులు పొద్దున లేవగానే దేవుడి పేరు చెప్పడం, మతాల పేరుతో రాజకీయాలు చేయడం తప్ప ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని మంత్రి విమర్శించారు. మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలకు స్వస్తి పలకాలని అన్నారు. దేశ ప్రజలందరినీ కలుపుకొని ముందుకు తీసుకెళ్లే రాజకీయాలు అవసరమని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజల ఓటు హక్కును ఎవరైనా ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తే ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. యువత, విద్యార్థులు, ప్రజాసంఘాలు ప్రజాస్వామ్య పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణేతలని, ప్రజల ఓటుతోనే ప్రభుత్వాలు ఏర్పడతాయని మంత్రి తెలిపారు. “ఓటును కాపాడండి.. దేశాన్ని కాపాడండి” అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మిత్రపక్షాల నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

27 లక్షల మంది విద్యార్థులకు వేడివేడి అల్పాహారం

మొదటిపేజీ తరువాయి – రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడివేడి అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో మరెక్కడా లేదని, తెలంగాణలోనే ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఉచితంగా కాకుండా రాష్ట్ర భవిష్యత్తు మానవ వనరులపై చేస్తున్న పెట్టుబడిగా చూడాలని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని మునగాల గ్రామంలో పాఠశాల విద్యార్థుల కోసం రూ.9.6 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

1,020 పాఠశాలలు.. 60 వేల మంది విద్యార్థులు

మునగాలలో నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా 1,020 పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేడివేడి అల్పాహారం అందించనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని చెప్పారు. మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నట్లు తెలిపారు. ఎదిగే వయసులో పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తేనే వారు ఆరోగ్యవంతమైన మానవ వనరులుగా ఎదుగుతారని అన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండి, నాణ్యమైన విద్యను అభ్యసిస్తే భవిష్యత్తులో రాష్ట్ర ఉత్పాదకత పెరిగి జీఎస్‌డీపీ వృద్ధికి దోహదం చేస్తారని పేర్కొన్నారు.

సంక్షేమం ఉచితం కాదు.. పెట్టుబడే

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఉచితాలుగా చూడటంజూ సరికాదని డిప్యూటీ సీఎం అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల కోసం ప్రభుత్వం చేస్తున్న ఖర్చు అంతిమంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే పెట్టుబడేనని పేర్కొన్నారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి కార్యక్రమాల లక్ష్యం పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమేనన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటం, పిల్లలు చదువుకోవడం, మహిళలు ఆర్థికంగా ఎదగడం, రైతులకు పెట్టుబడి సాయం అందడం ద్వారా ఉత్పాదకత పెరుగుతుందని చెప్పారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే ఆర్థిక కార్యకలాపాలు పెరిగి రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి దోహదపడతాయని వివరించారు.

బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్తు లేదు

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని చేస్తున్న ప్రకటనలపై స్పందించిన భట్టి విక్రమార్క.. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. “ఇందిరమ్మ ఇళ్లను ఆపడానికి వస్తారా? సన్నబియ్యం పంపిణీ నిలిపివేయడానికి వస్తారా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఆపడానికి వస్తారా? మహిళలకు వడ్డీలేని రుణాలను నిలిపివేయడానికి వస్తారా? పేద విద్యార్థులకు అందుతున్న ఆర్థిక సాయాన్ని ఆపడానికి వస్తారా?” అని ప్రశ్నించారు. ప్రజలు అమాయకులు కాదని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గమనిస్తున్నారని పేర్కొంటూ “బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదు” అని వ్యాఖ్యానించారు.

నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ బీమా

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని తీసుకురానున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కుటుంబ యజమానికి అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి రూ.5



లక్షల ఆర్థిక భద్రత కల్పించేలా పథకాన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు.

రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్

ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులంతా ఒకే ప్రాంగణంలో, ఒకే కుటుంబంలా చదువుకునేలా వీటిని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియం విద్యతో పాటు క్రీడలు, స్టేడియం తదితర అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

ప్రజలే మా కుటుంబం

కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంత ప్రజలే తమ కుటుంబమనే భావనతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనిచేస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాప్రతినిధులు అధికారాన్ని ప్రదర్శించేందుకు కాకుండా ప్రజలు అప్పగించిన బాధ్యతను నెరవేర్చేందుకు పనిచేయాలని పేర్కొన్నారు. ఆ దిశగా ఉత్తమ్ దంపతులు ప్రజలకు సేవ చేస్తున్నారని అభినందించారు. మునగాల హెలిప్యాడ్ నుంచి సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ శంకుస్థాపన ప్రాంతం వరకు కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు సుమారు 500 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు స్వాగతం పలికారు.

ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలిస్తాం

మొదటిపేజీ తరువాయి – మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని చెప్పామని వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద గౌడ్, పలువురు లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇందిరమ్మ టవర్స్ ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం 7,000 మందికి పైగా దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి, 480 మంది లబ్ధిదారులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే



వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ మేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని



సూచించారు. మీ కళ్ల ముందే మీ ఇల్లు నిర్మించబడాలి నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలి అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. పేదవాడి సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా, కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ సెక్రటరీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు

రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా ఆరా తీశారు. రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

కొంపల్లి పట్టణ ప్రణాళిక అధికారుల తూతూ మంత్రం చర్యలు

- ఎట్టకేలకు కదిలిన యంత్రాంగం కాదు.

- కలిసొచ్చిన దొంగాటే మళ్ళీ ఆడుతున్న పట్టణ ప్రణాళిక అధికారులు.

ఆదేశాలు వచ్చాయి అక్రమ షెడ్డు గోడలు కూలాయి.

చర్యలు తీసుకోవడం అనే మాటకి కొత్త భాష్యాన్ని చెప్తున్న బల్దియా అధికారులు.

రామిరెడ్డి నగర్ షెడ్డుపై మళ్ళీ పాక్షిక చర్యలే !

ఎవరిని తృప్తిపరచడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారు?

అధికారుల పర్యవేక్షణను చిత్రిస్తున్న విలేకరులపై నిర్మాణదారుల దురుసు ప్రవర్తన.

అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)కనుసన్నల్లోనే ఈ కాలయాపన పనులా?

కొంపల్లి,అక్టోబర్07(విజన్ పక్షం దినపత్రిక): కొంపల్లి మున్సిపల్ సర్కిల్ పరిధి రామిరెడ్డి నగర్ లో అక్రమంగా నిర్మాణం జరుగుతున్న భారీ షెడ్డుపై పట్టణ ప్రణాళిక అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టారు. గతంలో ఇదే షెడ్డుపై అనుమతులు లేని కారణంగా అప్పటికే కట్టిన గోడలను కూల్చి తమ పని అయిపోయింది అని చేతులు దులుపుకొన్నారు. ఇక్కడ కొసమెరుపు ఏంటంటే అప్పటికే సదరు నిర్మాణదారులకు అధికారులకు ఓ వ్యక్తి



రామిరెడ్డి నగర్ లోని అక్రమ షెడ్డు ఇదే

మధ్యవర్తిత్వం నెరపి ఆమ్యామ్యాలు ముట్టజెప్పడం మూలంగానే అధికారులు షెడ్డుపై చర్యలు తీసుకునే విషయంలో తర్జనభర్జనలు పడుతున్నారని పలువురి వాదన.ఇదిలా ఉంటే అసలు అనుమతులకు విరుద్ధంగా ఉందంటూ కూల్చివేతలు చేసిన సదరు నిర్మాణం మళ్ళీ తిరిగి నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగడంతో కొంపల్లి సర్కిల్ కార్యాలయానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో చేసేది లేక టౌన్ ప్లానింగ్ అధికారులు భారీ షెడ్డుపై చర్యలు నెపంతో బుధవారం నాడు పాక్షికంగా గోడలను కూల్చి వెళ్లారు.అయితే కట్టడానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా కంటితుడుపు చర్యలు చేస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం పనితీరు చూసి అంతా ముక్కున వేలేసుకుంటున్నారు.ఒక్క కొంపల్లి సర్కిల్ మొత్తంలో నిర్మాణం అవుతున్న షెడ్డులన్నీ పట్టణ ప్రణాళిక విభాగ అధికారుల కనుసన్నల్లోనే నిర్మితమవుతున్నాయనే వాదన బలంగా వినిపిస్తోంది.ఇక్కడ కొస మెరుపు ఏంటంటే అధికారులు జేసీబీ లను,పది మందికి పైగా మున్సిపల్ సిబ్బంది,కార్మికులు,గ్యాస్ కట్టర్లను వెంటబెట్టుకుని వచ్చి కేవలం ఒక్క గోడ కూల్చివేళ్ళడం విడ్డూరం అంటున్నారు పలువురు స్థానిక వాసులు. సర్కిల్



ఎస్వీ కోపరేటివ్ సొసైటీలోని ఈ అక్రమ షెడ్డులపై చర్యలు ఉండవా?

కార్యాలయంలో జరుగుతున్న ఈ గోల్ మాల్ వ్యవహారం గుట్టు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తుందా లేక కిందిస్థాయి ఉద్యోగులు అదనపు సిటీ ప్లానర్ వీళ్లంతా కమిషనర్ కనుసన్నల్లో చేస్తున్న వ్యవహారమా?అనే గుసగుసలు వినిపిస్తున్నాయి.ఇకనైనా భారీ అక్రమ నిర్మాణాలపై చర్యలు తూతూ మంత్రంగా కాకుండా చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజల మన్ననలు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఎప్పుడు చురగొంటారో? అసలు అధికారులు అప్పుడప్పుడు వెళ్లి గోడలను మాత్రమే కూల్చడం ఎలాంటి చర్యలు కిందకొస్తాయో అధికార యంత్రాంగమే సెలవియ్యాలని స్థానికంగా వినిపిస్తున్న మాటలు.

ఎస్వీ కోపరేటివ్ సొసైటీలోని అక్రమ షెడ్డుల మాటేమిటి రామిరెడ్డి నగర్ కు ఆనుకుని పారిశ్రామికవాడలోని ఎస్వీకోపరేటివ్ సొసైటీలో మరో రెండు అతిభారీ షెడ్డుల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయి. అయితే అధికారులకు అవి కనిపించట్లేవా లేదంటే ఫిర్యాదులు అందితేనే విధి నిర్వహణ గుర్తుకొస్తుందా? ప్రశ్నలు తలెత్తుతున్నాయి ప్రజల్లో.టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను ఎందుకు ఉపేక్షిస్తూ ఆనక ఫిర్యాదులు అందినప్పుడు వచ్చి గోడలను కూల్చి చర్యలు తీసుకున్నామనడం పరిపాటిగా మారిపోయింది. కొంపల్లి సర్కిల్ కార్యాలయంలో యంత్రాంగ పనితీరుపై తీవ్ర ఆరోపణలు అభ్యంతరాలు



అక్రమ షెడ్డు దీనిపై చర్యలేవి?



పాక్షికంగా గోడలను కూలుస్తున్న మున్సిపల్ యంత్రాంగం

వస్తున్న నేపథ్యంలో అధికారులు ఆరోపణలన్నింటిని తిప్పుకొట్టే దిశగా తమ విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించి అక్రమ షెడ్డులు, నిర్మాణాలపై ఉక్కుపాదం మోపి గట్టి చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశిస్తున్నారు.

2 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికిలి శంకుస్థాపనలిచేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



బడంగ్పేట్,అక్టోబర్07(విజన్ పక్షం దినపత్రిక): మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్పేట్ సర్కిల్ నాదర్గుల్ డివిజన్ పరిధిలో అల్మాస్గూడ సౌభాగ్య లక్ష్మీ నగర్ కాలనీ నుంచి పోచమ్మకుంట వరకు ఉన్న ఓపెన్ నాలాపై బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. చెరువుకు చెరువుకు మధ్య వరద లింక్ మిస్ ఐనప్పుడు, కాలనీలోకి వరదలు వచ్చినప్పుడు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే...మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ వరద ముంపుకు శాశ్వత పరిష్కారం కోసం సీచీఐ నాలా నిర్మాణం కొరకు 1250 కోట్ల రూపాయలు కేటాయించారని అన్నారు. 80 శాతం పనులు కెసిఆర్ హయంలోనే పూర్తి కాగా.. మిగతా పనులను పూర్తి చేయాలనీ ఇప్పుడు అధికారూలపై ఒత్తిడి తెస్తున్నామని అన్నారు. రాబోయే వర్షాకాలం లోపు పనులన్ని పూర్తి చేసి ప్రజలకు ముంపు సమస్య లేకుండా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ లో చేస్ అకాడమీ స్కేటర్స్ సత్తా - 11 పతకాలు కైవసం




విజయవాడ అక్టోబర్07(విజన్ పక్షం దినపత్రిక): 38వ కృష్ణా డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ - 2026 పోటీలలోయనమలకుదురు తాడిగడప డొంక రోడ్డు లోని చేస్ స్కేటింగ్ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు.ఈ నెల 2, 3, 4 తేదీలలో గన్నవరంలో జరిగిన ఈ ఛాంపియన్ షిప్ లో చేస్ అకాడమీ విద్యార్థులు 2 గోల్డ్, 3 సిల్వర్, 6 బ్రాంజ్ మెడల్స్ తో సత్తా చాటారు.పతకాలు సాధించిన విజేతలు జీ రుద్వీర్, జీ జాన్వీ, కె కోరేష్, జంపాని సాయి దర్ష్, ఎం దక్షిత్, కె హరిన్, లను అకాడమీ యాజమాన్యం ఘనంగా అభినందించింది. ఈ సందర్భంగా తాడిగడప డొంక రోడ్డు వద్ద ఉన్న చేస్ స్కేటింగ్ రింక్ వద్ద విజేతలకు అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ గన్నవరం డాక్టర్ మౌనిక, డాక్టర్ హనీషా, పాల్గొని విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే క్రీడల పట్ల ఆసక్తి చూపుతూ జిల్లా స్థాయిలో పతకాలు సాధించడం గర్వకారణమని, రాబోయే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో కూడా ఇదే స్ఫూర్తితో రాణించాలని ఆకాంక్షించారు.అకాడమీ అధినేతలు జె రఘురామ్, ఎం జయరాం, వి వెంకటేష్ లు మాట్లాడుతూ తమ అకాడమీ నుండి మరింత మంది స్కేటర్లను జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం చేస్ అకాడమీ సిబ్బంది కోచ్ కె శ్రీధర్, కె విజయలక్ష్మి, వెంకటేష్ లను విజేతల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ స్కేటర్స్ వీరి తల్లిదండ్రులు పాల్గొన్నారు

25 ఏళ్ల ప్రజా సేవా శిఖరానికి నమో

ఆధునిక ఉక్కు మనిషి ప్రధాని మోదీ వజ్రసంకల్పం నెరవేరాలి.

వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేష్ పూజలు.



అమరావతి: దేశ శ్రేయస్సు-ప్రజాసంక్షేమమే లక్ష్యంగా 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం పూర్తి చేసుకున్న ఆధునిక ఉక్కుమనిషి ప్రధాని నరేంద్ర మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ప్రధాని వికసిత్ భారత్ వజ్రసంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ అమరావతిలోని వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేష్ పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్నారు. 2001 అక్టోబరు 7వ తేదీన గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలైన మోదీ గారి ప్రస్థానం నేటితో 25 ఏళ్లు (రజతోత్సవం) పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పేరు మీద వెంకటపాలెం ఆలయంలో లోకేష్ పూజలు చేశారు. ప్రపంచంలోనే మన దేశం అన్నిరంగాల్లో నెంబర్ వన్‌గా ఉండాలనే లక్ష్యంతో నిస్వార్థంగా పనిచేస్తున్న ఆధునిక ఉక్కుమనిషి నరేంద్ర మోదీ గారికి ఆ శక్తియుక్తులన్నీ దేవుడు ప్రసాదించాలని లోకేష్ ప్రార్థించారు. మోదీ ప్రజాసేవా

రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

బాపట్ల మండలం కంకటపాలెం రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు చేశారు.

బాపట్ల: అక్టోబర్07(విజన్ పక్షం దినపత్రిక): బాపట్ల మండలం కంకటపాలెం గ్రామంలో సమగ్ర భూ రీ-సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో, రైతులకు అత్యాధునిక భద్రతా ప్రమాణాలు మరియు అధికారిక రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు గారు స్వయంగా రైతులకు కొత్త పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ నరేంద్ర వర్మ రాజు గారు మాట్లాడుతూ.. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, రైతుల భూములకు పూర్తి రక్షణ కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో కూడిన ఈ నూతన పాస్ పుస్తకాల వల్ల రైతులకు ఎంతో భద్రత చేకూరుతుందని, భవిష్యత్తులో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ హరి కుమార్, తాసిల్దార్ సలీమా, తెలుగుదేశం,జనసేన,బీజేపీ నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.









మహోత్సవాలకు మహా సన్నాహాలు

- మూడు ప్రధాన ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- ఎంతమంది వచ్చినా ఎక్కడా ఇబ్బంది లేకుండా సౌకర్యాలు

- అధికారులు ప్రణాళికాయుత సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

అక్టోబర్07(విజన్ పక్షం దినపత్రిక): విజయవాడకు ప్రత్యేకమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలతో పాటు సరస్ అజీవిక మేళా, విజయవాడ ఉత్సవ్--2.0 కూడా ఒకేసమయంలో జరగనున్న నేపథ్యంలో సమన్వయ శాఖల అధికారులు పటిష్ట సమన్వయంతో పనిచేయాలని.. ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలక భాగస్వాములు కావాలని ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టరేట్ శ్రీ ఏపీఎస్ రెడ్డి హాల్‌లో ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అధికారులతో సమావేశ మయ్యారు. ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు. ఈసారి వివిధ రాష్ట్రాల నుంచి కూడా ప్రముఖులు హాజరుకానున్నారని.. అదే సమయంలో సామాన్య



భక్తులు, సందర్శకులకు పెద్దపీట వేస్తూ చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించారు. ఇంకా ఏవైనా పనులు మిగిలియుంటే యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. దసరా ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను ముందస్తు ప్రణాళికలకు అనుగుణంగా నిర్వర్తించాలని సూచించారు. భక్తులకు సంతృప్తికరమైన దర్శన అనుభవం కల్పించడంతో పాటు వారికి నగర పర్యటన ప్రత్యేక ఉత్సవాల ద్వారా మధురానుభూతులను మిగిల్చేలా చూడాలన్నారు. సరస్ మేళాలో దేశం నలుమూలల నుంచి



స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులతో దాదాపు 650 స్టాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని.. అదే విధంగా వినూత్న కార్యక్రమాలతో విజయవాడ ఉత్సవ్ వేదిక కానుందన్నారు. ప్రముఖుల పర్యటనలు, వేదికల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పోటీలు, ఫుడ్ ఫెస్టివల్స్, క్రీడాపోటీలు తదితరాలపైనా సమావేశంలో చర్చించి.. ప్రజల భాగస్వామ్యంతో ఉత్సవాల నిర్వహణను విజయవంతం చేయడంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏఎన్వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు. (సమాచార, పౌర సంబంధాల శాఖ, ఎన్టీఆర్ జిల్లా ద్వారాజారీ)

జిల్లా స్థాయిలో ఘనంగా యువజన ఉత్సవాల పోటీలు

యువతలో సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందించుకోవాలి.

శాసనసభ్యులు గొండు శంకర్

శ్రీకాకుళం, **అక్టోబర్07(విజన్ పక్షం దినపత్రిక):** యువత సృజనాత్మకత, నైపుణ్యాలు కలిగి ఉండాలని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. జనవరి 12, 2027 స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిలో సృజనాత్మకత, నైపుణ్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో జిల్లా స్థాయిలో యువజన ఉత్సవాల పోటీలను యువజన సర్వీసులు, సెట్ శ్రీ, ముఖ్య కార్యనిర్వహణాధికారి, వి.విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో గురజాడ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ యువత సృజనాత్మకత, నైపుణ్యాలు కలిగి ఉండాలని, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సామాజిక బాధ్యతతో మంచి భావిభారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు వ్యక్తులు మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సామాజిక బాధ్యతలను పెంపొందించడంతో పాటు, వారి ప్రతిభకు సరైన వేదిక కల్పించడమే యువజన ఉత్సవాల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. యువత ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వివిధ కళాశాల నుండి పాల్గొన్న విద్యార్థులకు కవిత రచన, వీధి నాటకం, జానపద బృంద నృత్యం, జానపద బృంద గానం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతల ఎంపికలో న్యాయ నిర్ణేతలుగా టీచర్ నీరజ, అనురాధ








వ్యవహరించారు. జిల్లాలోని వివిధ కళాశాల నుంచి వచ్చిన యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. కవితా రచన పోటీలో ఆర్. తేజస్వి, గాయత్రి కళాశాల సైన్స్ అండ్ మేనేజ్మెంట్ మొదటి బహుమతి విజేతగా నిలిచారు. రెండవ విజేతగా పి. పూజిత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం నందిగాం వారికి, జె. సోనియా, గాయత్రి కళాశాల మూడో విజేతగా నిలిచారు. వీధి నాటకం పోటీలో పద్మావతి డిగ్రీ కాలేజ్ నరసన్నపేట, ప్రథమ బహుమతి, గురజాడ డిగ్రీ కాలేజ్ సమీరా టీం రెండో బహుమతి, గురజాడ డిగ్రీ కాలేజ్ సౌమ్య టీం మూడవ బహుమతి గెలుచుకున్నారు. జానపద బృంద నృత్యం పోటీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం కంచిలి సిద్దు టీం, మొదటి బహుమతి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం నందిగాం రెండో బహుమతి, సాయికుమార్ కంచిలి,మూడో బహుమతి లభించింది. జానపద బృంద గానం పోటీలో ఎస్. శిరీష, ఐఐఐటి ఎచ్చెర్ల, మొదటి బహుమతి, కృష్ణ చైతన్య గాయత్రి డిగ్రీ కాలేజ్ రెండో బహుమతి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం నందిగాం, పవిత్ర టీం, మూడో బహుమతి సాధించారు. చిత్రలేఖనం పోటీలో మొదటి విజేతగా టి. దీపిక, రెండో స్థానంలో ఎస్ . హిమబిందు, మూడవ బహుమతి వి.గోపీచంద్ సాధించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు స్థానిక శాసనసభ్యులు చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన యువత తదుపరి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యే అవకాశం ఉంటుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో గురజాడ స్కూల్ కరస్పాండెంట్ ఎస్. సంయుక్త, మేరా యువ భారత్ జిల్లా యువజన అధికారి, నమ్ముల కృష్ణ, ఆర్ట్స్ చీ+ూ(స్వచ్ఛంద సంస్థ) సన్యాసిరావు, సుడా ఎస్.ఇ. సుగుణాకర్ రావు, టూరిజం అధికారి నారాయణరావు, రెడ్ క్రాస్ ప్రతినిధి, పెంకి. చైతన్యకుమార్, కె.వెంకటరమణ, మేజర్ సెట్ శ్రీ, ఎడ్యుకేషన్ అండ్ స్టూడెంట్

అవును నాగలి కూడా కవిత్వాయుధమే..!



కొమ్మవరపు విల్సన్‌రావు రాసిన 'నాగలి కూడా ఆయుధమే' కవిత్వ సంపుటి కోసం రాసి న ముందుమాటలో ఆచార్య కొలకలూరి ఇనాక్ 'కవి తనను తాను గుర్తెరగడమే కవిత్వం' అంటా రు. తనను తాను ప్రేమించుకోలేని వాడు ఎదుటివాళ్లను ప్రేమించలేడన్నట్టు.. కవి అన్నవాడు ఎల్లప్పుడూ ఉంటూ సామాజిక మార్పులను, స్థితిగతులను పరిశీలిస్తూ, అందులో జరిగే సంఘటనలను తన కవిత్వంలో ప్రతిబింబిస్తూ పాఠకులను ఆలోచింపజేయాలి. అలాంటి కవిత్వం రాయాలంటే సదరు కవి ఎంతో నిబద్ధతకలవాడై ఉండాలి. సరిగ్గా అలాంటి నిబద్ధత కలిగి కవిత్వాన్ని శ్వాసిస్తూ కవిత్వమే జీవితంగా జీవిస్తున్న కొద్దిమంది సహృదయ తెలుగు కవుల్లో విల్సన్‌రావు ఒకరని 'న్యాయనిర్ణేతవూ నీవే' నుంచి 'దేవుడు తప్పిపోయాడు', 'నాగలి కూడా ఆయుధమే' వరకు ఆయన కవిత్వాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. 'నాగలి కూడా ఆయుధమే' కవితల్లోకి వెళ్తే ఒక్కో కవిత ఒక్కో అనుభూతిని పాఠకుని స్థాయిని బట్టి అందిస్తున్నదని చెప్పవచ్చు. ఈ సంపుటిలో కవితలన్నీ దేనికదే అచ్చుపోసినట్టు, ఎక్కడ కూడా అవసరం లేని పదాలను వాడినట్టు అనిపించదు. చిన్న చిన్న కవితల్లోనూ విశ్వజనీన విషయాలను అలవోకగా కవిత్వం చేశారు రచయిత విల్సన్. కవిత్వం అంటే ఏమిటి? కవిత్వం ఎలా ఉండాలి? కవిత్వమనే సృజన కళ గురించి ఇతర కవులు తమ కవిత్వాన్ని పదును పెట్టుకోవటానికి అవసరమైన కవితా సామగ్రిని తన కవిత్వం ద్వారా అందిస్తారు. కవుల కవిత్వం కష్టజీవుల చెక్కిళ్లమీంచి జారే కన్నీళ్లను తుడిచి నవ్వుల పరిమళం అద్దుతూ సాంత్వన ఇవ్వాలంటూ.. జీవితం పట్ల భరో సానిచ్చే కవిత్వం ఎలా ఉండాలో డిఫైన్ చేస్తాడు. ఇద్దరు కలిసి కలబోసుకున్న కవి సమయాల్ని ఈ కవితలో ఇలా తలపోస్తాడు. 'ఈ నడిరాతిరి నక్షత్ర జలపాత హోరులో/ నువ్వు నా కళ్లముందు రూపు కడుతున్నట్టు/ నాలో స్వచ్ఛ కన్నీటి చెమ్మకోసం/ నువ్వు ఎదురుచూస్తున్నట్టు కలకంటున్నాను' అం టూ.. తన జీవితానికి ఎంతో భరోసానిచ్చి, అతిసున్నితంగా గుండెతడిని తడిమి ధిక్కార వ్యాకరణమైన సైదా కవితా జలపాతాల్లో మునిగితేలుతూ తమ స్నేహతత్వాన్ని అజరామరం చేసే కవితనొక్కటి రాస్తానని ఆ జ్ఞాపకాల్ని నెమరేసుకుంటాడు. ఇంత విలక్షణమైన కవిత్వనాగలితో సాహితీ సేద్యం చేస్తూ కవిత్వప్రియుల హృదయాల్లో నిలిచిపోయే కవిత్వాన్ని రాస్తున్న విల్సన్‌రావు ఇంకా తన కవిత్వ సృజనకు పదును పెడుతూ, అద్భుతమైన కవిత్వ సంపుటాలను వెలువరించాలి.

ఈ ఆహారాలను తింటే చాలు

రక్తం కడిగేసినట్లు క్లీన్ అవుతుంది



మన శరీరానికి రక్తం ఇంధనం లాంటిదని చెప్పవచ్చు. ఇది అనేక రకాల పోషకాలను శరీరంలోని కణాలకు, అవయవాలకు సరఫరా చేస్తుంది. అలాగే ఆక్సిజన్‌ను రవాణా చేస్తుంది. దీంతో శరీర అవయవాలకు ఎప్పటికప్పుడు శక్తి, పోషణ లభిస్తాయి. అలాగే ఆయా అవయవాల్లో పేరుకుపోయే వ్యర్థాలను రక్తం బయటకు తీసుకు వస్తుంది. అందువల్ల రక్తం చాలా శు భ్రంగా ఉండాలి. రక్తంలో గ్లూకోజ్ లేదా కొవ్వులు, ఇతర పోషకాలు సరైన స్థాయిలో ఉండాలి. వ్యర్థాలు కూడా పేరుకుపోకూడదు. అందుకు గాను రక్తాన్ని శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ఇక పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తశుద్ధి జరుగుతుంది. రక్తం శు భ్రంగా మారి రోగాల నుంచి బయట పడతాము. ఇక రక్తం శుద్ధి అవ్వాలంటే అందుకు తీసుకోవాల్సిన ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

వెల్లుల్లి..

కొందరు రోజుకు తగినన్ని నీళ్లను తాగరు. దీంతో రక్తంలో వ్యర్థాలు పేరుకుపోతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. రక్తం శుభ్రంగా ఉండాలన్నా, అందులోని వ్యర్థాలు బయటకు ఎప్పటికప్పుడు పోవాలన్నా నీళ్లను రోజూ తగిన మోతాదులో తాగాల్సి ఉంటుంది. అలాగే కిడ్నీలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. ఇక రక్త శుద్ధి జరగాలంటే రోజూ ఉదయం పచ్చి వెల్లుల్లి రెబ్బలను నేరుగా అలాగే తింటుండాలి. ఇవి ఘాటుగా ఉంటాయి కనుక చాలా మంది తినలేరు. అయితే వెల్లుల్లిని తేనెతో కలిపి తినవచ్చు. దీంతో కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. రక్తంలో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు పోతాయి. కనుక వెల్లుల్లిని రోజూ ఆహారంలో భాగం చేసుకోవాలి. అలాగే రోజూ భోజనం చేసిన అనంతరం చిన్న బెల్లం ముక్కను తినడం వల్ల కూడా రక్తం శుద్ధి అవుతుంది. శరీరంలో రక్త సరఫరా పెరుగుతుంది. బీపీ నియంత్రణలోకి వస్తుంది.

పసుపు..


పసుపును మనం నిత్యం వంటల్లో ఉపయోగిస్తుంటాం. పసుపు కూడా రక్తాన్ని శుద్ధి చేయడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రక్తాన్ని శుద్ధి చేస్తాయి. రోజూ పుసుపు టీ తాగవచ్చు. లేదా రాత్రి పూట పాలలో పసుపు కలిపి తాగినా కూడా మేలు జరుగుతుంది. అదేవిధంగా నిమ్మరసం కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. నిమ్మరసం సేవిస్తుంటే కేవలం రక్తం శుద్ధి జరగడమే కాదు లివర్, శరీరం కూడా శుభ్రంగా మారుతాయి. వ్యర్థాలు సులభంగా బయటకు పోతాయి. కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే యాపిల్స్‌ను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ఇవి కూడా రక్తాన్ని క్లీన్ చేయగలవు. రక్తం తయారయ్యేలా చేస్తాయి. దీంతో రక్తహీనత నుంచి బయట పడవచ్చు.

క్యాబేజీ..

ఆకుపచ్చని కూరగాయలు లేదా ఆకుకూరల్లో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తహీనతను తగ్గిస్తుంది. రక్త సరఫరా మెరుగు పడేలా చేస్తుంది. దీంతో రక్తశుద్ధి కూడా జరుగుతుంది. ఇక క్యాబేజీని కూడా ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. దీంతోనూ రక్తం శుభ్రంగా మారుతుంది. ఓట్స్, నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే శరీరానికి శక్తి, పోషణ లభించడమే కాదు రక్తం క్లీన్ అవుతుంది. ఇలా పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తాన్ని క్లీన్ చేసుకోవచ్చు. దీంతోపాటు కిడ్నీలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. మూత్రం సాఫీగా జారీ అవుతుంది. ఆరోగ్యంగా ఉంటారు.

అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మి కార్టర్ కన్నుమూత





అమెరికా మాజీ అధ్యక్షుడు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత జిమ్మీ కార్టర్ కన్నుమూశారు. అనారోగ్య కారణాలతో జార్జియాలోని ప్లెయిన్స్‌లో ఉన్న తన నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు జేమ్స్ ఇ. కార్టర్ తెలిపారు. రెండు నెలల క్రితమే (అక్టోబర్ 1న) 100వ పుట్టిన రోజు జరుపుకున్న కార్టర్.. అమెరికాకు 39వ అధ్యక్షుడిగా వ్యవహరించారు. దీంతో అమెరికా చరిత్రలో ఎక్కువ రోజులు జీవించిన తొలి ప్రెసిడెంట్‌గా రికార్డు సృష్టించారు. 2002లో నోబెల్ శాంతి పురస్కారం దక్కించుకున్నారు. ప్రస్తుతం ఆయన డెమొక్రటిక్ పార్టీ సభ్యుడిగా ఉన్నారు. 1924 అక్టోబర్ 1న రైతు కుటుంబంలో జన్మించిన జిమ్మీ కార్టర్.. అమెరికా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1977లో అసాధారణ రీతిలో ఆయన దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. 1981 వరకు ప్రెసిడెంట్‌గా కొనసాగారు. కాగా, 1946లో యూఎస్ నవల్ అకాడమీలో చేరిన జిమ్మీ కార్టర్, ఆ తర్వాత యూఎస్ నేవీ సబ్‌మెరైన్ సర్వీస్‌లో పని చేశారు. మిలిటరీ సేవలు ముగించుకున్న తర్వాత తన కుటుంబంతో కలిసి పల్లీల వ్యాపారాన్ని మొదలుపెట్టారు. అమెరికాలో పెరిగిపోతున్న జాత్యాహంకారాన్ని చూసి తట్టుకోలేక 1960ల్లో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1971లో తొలిసారిగా జార్జియా రాష్ట్రానికి గవర్నర్‌గా ఎన్నికయ్యారు. సరిగ్గా ఆరేండ్ల తర్వాత రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు గెరాల్డ్ ఫోర్డ్‌ను ఓడించి జిమ్మీ కార్టర్ అమెరికా ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. 1976లో రిప్లబిక్ పార్టీ ప్రెసిడెంట్ గెరాల్డ్ ఫోర్డ్‌పై గెలిచి, అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. తన పదవీకాలంలో మానవ హక్కుల పరిరక్షణతోపాటు పర్యావరణ సంక్షేమం కోసం కృషి చేశారు. 1978లో ఇజ్రాయిల్, ఈజిప్ట్ మధ్య శాంతి ఒప్పందం కుదరడంలో కార్టర్ కీలక పాత్ర పోషించారు. 2002లో నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. కార్టర్ భార్య రోసలెన్ స్మిత్.. 2023లో 96 ఏండ్ల వయసులో మృతి చెందారు. వీరికి నలుగురు సంతానం. కాగా, 1978 లో అప్పటి జనతా పార్టీ ప్రభుత్వం ఆహ్వానం మేరకు ఆయన భారతదేశంలో మూడు రోజుల పాటు పర్యటించారు. ఆ సందర్భంగా గుర్‌గావ్ సమీపంలోని దౌల్తాపూర్‌ను సందర్శించడంతో ఆ ఊరు పేరు కాస్తా కార్టర్‌పూర్‌గా మారిపోయింది. కాగా, జిమ్మీ కార్టర్ మృతిపట్ల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ప్రమథ మహిళ జిల్ బైడెన్ సంతాపం తెలిపారు.

సమాజ పరిణామ ప్రతిబింబం



'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ.' అని చలం మహా ప్రస్థానానికి రాసిన ముందుమాటలో చెప్తాడు. తను వ్యక్తిగతంగా వంపి ప్రపంచానికి పంచడం ఒక పద్ధతి. తన ముందు జరుగుతున్న అనేక విషయాలకు సంచలించి, దాన్ని అక్షరబద్ధం చేయడం ఇంకో పద్ధతి. ఈ రెండవ బాధే నేటి అన్ని అస్తిత్వ వాదాలకు మూలం. అన్ని ఉద్యమాలకు, ప్రశ్నలకు హేతువుగా నిలిచేదిదే. ఒక అణచివేతకు సమాధానంగా, ఒక ప్రశ్నకు నిలువెత్తు జవాబుగా సాహిత్యం రావడం, ప్రథమంగా కవిత్వం రావడం తెలుగు సాహిత్యంలో, లేక భారతీయ సాహిత్యంలో, ఆ మాటకొస్తే ప్రపంచ సాహిత్యంలో ఎక్కడైనా జరుగుతున్నదే. 'తనకు ప్రపంచానికి సామరస్యం కుదిరేదాకా కవి చేసే అంతర్ బహిర్ యుద్ధారావమే కవిత్వం' అంటూ అదే ముందుమాటలో చలం చెప్పిన నిర్వచనం ఈ సామాజిక బాధ నుంచి పొటమరించిందే. ఒకప్పటి అస్వతంత్ర భారతదేశంలో భారతీయత అవమానించబడింది. ఇది ముక్కలుగా ఉండే దేశమే గాని, దీనికి అస్తిత్వం లేదన్నారు పరపాలకులు. అట్లాంటి అధికృత వ్యక్తీకరణకు సమాధానంగా వచ్చిందే. ఈ పునర్జీవన ఉద్యమం చరిత్ర రచనతో ప్రారంభమై సాంస్కృతిక అస్తిత్వం ప్రకటిస్తూ కవితా రచనై కొనసాగింది. భారతీయ సాంస్కృతిక అస్తిత్వం కోసం బండార్కర్ (1837-1925) చరిత్ర రచన చేశాడు. ఇంకా ఎందరో చారిత్రక పరిశోధకులు తెరమీదికి వచ్చారు. ఫలితంగా భారతీయ సంస్కృతిని చిత్రీకరించిన కవిత్వం వచ్చింది. రవీంద్రనాథ్ ఠాగూర్ 1861-1941 జాతీయవాదం, మానవతావాదం పునాదులుగా వికసించిన కవి. స్వతంత్రేచ్ఛ వ్యక్తం చేసిన ఆయన చూడండి. అదే సమయంలో బంకించంద్ర రాసిన వందేమాతరం ఒక సంచలన జాతీయగీతం. రవీంద్రుని జనగణమన ఇప్పటికీ మనకు నిత్య స్మరణీయం. ఇదే కోవలో కవిత్వం రాసిన సరోజినీ నాయుడు రాసిన పేర్కొనదగినవి. జెండా ఊంఛా రహే హమారా రాసిన శ్యామలాల్ గుప్తా, 'ఇంక్విలాబ్ జిందాబాద్' అని నినదించిన హసరత్ మోహాని, రాసిన అరబిందో ఇట్లాగా ఎందరో కవులను పేర్కొనవచ్చు. క్రమంగా ఈ జాతీయవాదం దక్షిణాది కవులకు ప్రేరణ కలిగించింది. ఆ గాలితో వాళ్లు కూడా ఈ కవిత్వం రాయడం మొదలుపెట్టారు. రాయప్రోలు, విశ్వనాథ, తుమ్మల లాంటి వాళ్లందరూ ఈ అంశం ఎత్తుకున్నారు. గురజాడలో కూడా ఈ వాదం మొలకెత్తినప్పటికీ అది ఇంకొంచెం ముందు అడుగు వేసి సామాజికవాదంగా పరిణమించడం మనం గమనిస్తాం. తెలుగు సాహిత్యంలో 'భరతఖండమ్ము చక్క ని పాడియావు' అనే పద్యం జాతిని ఉర్రూతలూగించింది. కానీ, ఈ చైతన్యంలో ద్రావిడ స్పృహ, లేక దక్షిణాది అస్తిత్వ స్పృహ లోపించింది. జన గణ మన గీతంలో కూడా దక్షిణాది స్పృహ నామమాత్రమే. దక్షిణభారతం కూడా తన అస్తిత్వం ప్రకటించుకోవలసిన అగత్యం ఏర్పడింది. ఫలితంగా దక్షిణ భారతం తన చరిత్రను సంస్కృతిని స్మరించుకున్నది. దక్షిణాత్యుల ఆత్మ స్పృహతో నీలకంఠశాస్త్రి లాంటి రచనలు ఉత్ప్రేరకంగా నిలిచాయి. ఇలాంటి రచనలు ఎన్నో వెలువడ్డాయి. తెలుగుదేశంలో ఖండవల్లి లక్ష్మీరంజనం, బాలేందు శేఖరం, సురవరం ప్రతాపరెడ్డి లాంటి రచయితల చారిత్రక, సాంస్కృతిక స్పృహ అనితరంగా పనిచేసింది. ఈ స్పృహే తెలుగు కవిత్వంలో ప్రవేశించింది. 'గోదావరి పావనోదార వాః పూర మఖిలభారతము మాదన్న నాడు' లాంటి పద్యాల సృష్టి జరిగింది. 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా' లాంటి పాటలు వచ్చాయి. 'తెలివిగలవాళ్లంతా తెలుగోళ్లే' అన్న దురభిమానం విస్తరించింది. కానీ, అందులో తెలంగాణ స్పృహ లోపించింది. తెలంగాణలో కవులు లేరని శూన్యవాదం తలెత్తింది. సురవరం గోల్కొండ సం చిక దీన్ని సవాలు చేసింది. తర్వాత దాశరథి 'నా తెలంగాణ కోటి రత్నాలవీణ' అని గర్జించాడు. క్రమంగా తెలంగాణ చైతన్యం విస్తరించింది. తన స్వీయ అస్తిత్వం ప్రకటించింది. శంకరంబాడి సుందరాచారి రాష్ట్ర గీతంలో తెలంగాణ ప్రస్తావన నామమాత్రం కావడంతో తెలంగాణ కవి ప్రశ్నించిండు. సంగనభట్ల నరసయ్య, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సంగిశెట్టి లాంటి అనేకమంది చరిత్ర రచయితలు బయల్దేరారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం తెలంగాణ జాగృతి, శ్రీ రామోజు హరగోపాల్, వేముగంటి మురళి లాంటి చారిత్రక పరిశోధకులతో చరిత్ర రాయించింది. బతుకమ్మ, బోనాలు, బొడ్డెమ్మ తెలంగాణ సాంస్కృతికతను ప్రతిఫలించాయి. ఫలితంగా పొక్కిలి, మత్తడి, మునుం, జాగో జగావో, తెలంగాణ కవిత లాంటి అనేక కవితా సంకలనాలు తెలంగాణ అస్తిత్వాన్ని ప్రకటించాయి. ఈ సందర్భంగా వచన కవిత్వం ఇతర ప్రక్రియల కంటే విశిష్ట స్థానంలో నిలబడింది. అనేక ఇతర ప్రక్రియలకు తాత్విక స్పృహను ప్రోది చేసింది. ఇది పద్యం, పాట, కథ, నవల లాంటి ఇతర ప్రక్రియలోకి, తెలంగాణ స్పృహను అందించింది. క్రమంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం కూడా వచన కవిత్వం సాహిత్యరంగంలో ఒక ప్రధాన ప్రక్రియగా నిలబడింది. ఇట్లాంటి వచన కవిత్వం పరిణామాన్ని, వస్తువుతో పాటు పొందే నిర్మాణాన్ని, ప్రేరణలను ఒకసారి పరిశీలిద్దాం. బెల్లంకొండ సంపత్ కుమార్ ప్రతీకలతో అనుభూతిని సుసంపన్నం చేస్తున్నాడు. 'రంగులు పెత్తనమెత్తి/ రాజ్యం చేస్తుంటే/ కన్ను కాపాడుకునేది ఎట్లా?' అని వాపోతున్నాడు. ఈ విధంగా అరుణ నారద భట్ల, గాజోజు నాగభూషణం, సీహెచ్ ఉషారాణి, వాసరచెట్ల జయంతి, చమన్ సింగ్, మెర్సీ మార్గరెట్, బిల్ల మహేందర్ లాంటి కవులు ఎందరో తమ నిర్మాణ కుశలతను పెంచుకుంటూనే సమాంతర సామాజిక పరిస్థితులకు ప్రతిబింబాలై ప్రయాణం చేస్తున్నారు. నిజానికి ఏ కవి పరిపూర్ణుడు అని ఎవరూ చెప్పలేరు. అతని నిరంతర సాధనే, సామాజిక అవగాహనే అతణ్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది. ఆంగ్ల కవిత్వంలో 19వ శతాబ్ది ఉత్తరార్థంలో వచన కవిత్వం విస్తరించింది. అది 20 శతాబ్ది కల్లా ఒక బలమైన సాహితీ ప్రక్రియగా రూపాంతరం చెందింది. ఫ్రెంచ్ పదం కవిత్వానికి ప్రాతిపదికైంది. నుంచి లండన్ లో 1909లోని ఇది నిర్దిష్టత పొంద డం చూస్తాం. ఇక తెలుగు వచన కవిత్వంలో పద్యంలోని ఛందో లయ, గేయంలోని తాళ లయ సంగీ తం అధికారం తప్పించి, వస్తువు ప్రధానంగానే ఈ కవిత్వం పురుడు పోసుకున్నది. ఆధునిక కవిత్వం ఈ వరకు వచ్చిన సంప్రదాయ పరిణామవాదాన్ని తెలు గు కవిత్వం పేరిట, తెలంగాణ కవిత్వానికి సరైన ప్రాతినిధ్యం ఇవ్వకుండా జరిగిన సాహిత్య చరిత్ర పరిశోధనలను మినహాయిస్తే తెలంగాణ కవిత్వం ఈ వరకే చెప్పినట్టు ఒక ప్రశ్నకు, ఒక అణచివేతకు సమాధానంగానే విజృంభించింది. కందుకూరి వీరేశలింగం రాయప్రోలు సుబ్బారావు యుగాల నుంచి నిన్నమొన్నటి వచన కవిత్వ విశ్లేషణ దాకా తెలంగాణ కవి త్వం తెలుగు కవిత్వంలో ఒక చిన్న పాయగా మాత్ర మే చిత్రించారు. అంతెందుకు? ఇటీవల ఆంధ్ర ప్రాంతం నుంచి వస్తున్న కవితా సంకలనాల్లో ఒకరిద్దరు తెలంగాణ కవులను మినహాయిస్తే మిగతా కవులు గాని, వాళ్లు చెప్తున్న భావజాలం గానీ పరోక్షంగా వలస పెత్తనాన్ని మళ్లీ మనపై రుద్దే ప్రయత్నంగానే కనబడుతున్నది. కొన్ని కవితా సంకలనాల్లో చిత్రంగా ఇక్కడి కవులు కూడా సంపాదక భాగస్వామ్యం తీసుకోవడం, అదేదో కవితల ప్రచురణలో మహా ప్రమాణాలు పాటిస్తున్నామని, ఆంధ్ర ప్రమాణాలతో జబ్బచరచుకోవడం ఇక్కడి కొందరు మహా కవులకు ఇంకా అమాయకత్వంతో ఆవహించిన ఆం ధ్ర భ్రమగా మనం గుర్తించాలి. కాగా ఈ వరకే చెప్పినట్టు ఈ ఆంధ్ర దృక్పథంతో సాగిన విగడనను పక్క కు పెడితే, సాహిత్యంలో వినిర్మాణ వాదం ప్రవేశించిన తర్వాత తెలంగాణ వాదం మరింత అస్తిత్వంతో తొణికిసలాడింది. ఈ క్రమంలో తెలంగాణ వచన కవిత్వాన్ని పరిశీలిస్తే ఎన్నో విశేషాలు కనబడతాయి. వచన కవితారచనను గురించి. అంటాడు. వచ న కవితలో వచనం దూరితే తాను చెప్పదలుచుకు న్న వస్తువుకు చాలా అన్యాయం జరుగుతుంది. ఈ వచనం దూరకుండా కాపాడే శక్తి కవికి సాధన ద్వారానే వస్తుంది. అభ్యాసుడైన కవికి సాధారణంగా వస్తువే భాషను, నిర్మాణాన్ని ఎన్నుకుంటుంది. ఇది కవితాత్వికతకు అనురూపమైన వ్యక్తీకరణను సాధిస్తుంది. తాత్వికత కవి వ్యక్తిత్వానికి అనురూపంగా ఉంటుంది. తాత్వికత కవి సామాజిక వర్గాన్ని బట్టి, అతడు పుట్టిపెరిగిన వాతావరణాన్ని బట్టి, విద్యాలయాన్ని బట్టి, తల్లిదండ్రులను బట్టి వస్తుంది. కవితా వస్తువుకు తల్లిదండ్రి, భార్య, అన్న, చిన్ననాటి స్నేహితుడు, తన ఊరు, తన ముందు జరిగిన యాక్సిడెంట్, సంతోషం, దుఃఖం, ప్రణయం, సోదరి ప్రేమ ఇట్లా రకరకాల అంశాలు ప్రేరకాలవుతాయి. అతని వ్యక్తిత్వాన్ని బట్టి, సాధనను బట్టి, జ్ఞానాన్ని అనుసరించి వ్యక్తీకరణ ఉంటుంది. తెలంగాణ కవులు తమకు ఈ వరకు ఉన్న ప్రాపంచిక దృక్పథాన్ని తాత్విక పునాదులను నిర్మాణవాదం ద్వారా పొందిన స్ఫూర్తితో తెలంగాణకు అనుసంధానించడం చూస్తున్నాం. తెలంగాణ ఉద్యమ సందర్భంలోనూ, రాష్ట్ర అవతరణ జరిగినాక మన కలలు ఫలవంతం చేసుకునే దిశలోనూ తెలంగాణ కవి వ్యక్తీకరణలు ప్రత్యేకంగా గమనించదగినవి. రాజ్యం నిరంకుశత్వం ప్రశ్నిస్తూ 1980-90 వరకు రాసిన కవి గ్రామాల్లో భూస్వామ్యం నడ్డివిరిచే వరకే ఆగిపోలేదు. ఊహాజనితమైన విశాలతతో అగమ్యంగా ఉన్న తన విప్లవ భావజాలాన్ని తెలంగాణ వైపునకు మరలించాడు. వర్గ శత్రువు కంటే వలస దోపిడి దారే ప్రమాదకారి అని తెలంగాణ కవి గుర్తించిండు. ఈ వరకు స్త్రీవాద, దళితవాద, మైనారిటీ వాద వరుసలో ఉన్న తెలంగాణ సాహిత్యకారులకు తెలంగాణ దోపిడీ తక్షణ సమస్య అని అర్థమైంది. క్రమంగా తెలంగాణ సాహిత్య కారుని అడుగులు ఈ విషయంగా ముందుకు పడడం జరిగింది. ఫ్రెంచ్ విప్లవానికి ఊపిరి లూదిన థామస్ పెయిన్, తెలంగాణ బుద్ధిజీవికి ఆదర్శం అయ్యాడు. 1996లో జరిగిన సిద్దిపేట మంజీరా రచయితల సభ,1997, నవంబర్ 1 హైదరాబాద్‌లో మొజాంజాహీ మార్కెట్ అశోక్ టాకీస్‌లో ఫోరం ఫర్ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ పేరుతో జరిగిన సభ, 1997లో వరంగల్‌లో జరిగిన డిక్లరేషన్ సభ, బుద్ధిజీవులు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను సూచిస్తూ చేసిన ప్రయత్నాలు. నాటి తెలంగాణలో ఒక దిశలో రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యమయ్యాయి. అమానవ త్వం మన సాంస్కృతిక విలువలని ప్రశ్నార్థకం చేసిం ది. ఈ విషయమే ఎస్.రఘు ఇట్లా ప్రస్తావిస్తాడు. 'ఎండిపోయిన కన్నీటి చారికల లాంటి నేల మీద ఆంధ్ర రాజకీయాల వ్యాపారరంగాల్లో ఎండుటాకుల్లా రాలిపోతున్నాం కళ్ల ఎదుటే కాళ్ళ కింద భూమి కోల్పోతున్న నిరాశ్రయులం (పొక్కిలి) ఈ విధంగా అనేకమంది కవుల జీవవంతమైన కృషి ఉద్యమంతో పాటు కొనసాగింది. చివరికి కవి కల నెరవేరింది. తెలంగాణ సాకారమైంది. సబ్బండవర్ణాల సమరం విజయకేతనం ఎగురవేసింది. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం కూడా కవి విశ్రమించలేదు. ఏనాడు ఏ రకమైన ప్రశ్న తెలఎత్తినా, కవి స్పృహ అందుకు అనుగుణంగా పరావర్తనం చెందుతూనే ఉన్నది.తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం కవులు తన ప్రయాణం ఆపలేదు. కాగామళ్లీ ఇప్పుడు ఆంధ్ర వలసవాదులు బహురూపాలతో తెలంగాణ అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తూనే ఉన్నారు. కవికి కవితా సాధనతో పాటు ఆధునిక సామాజిక పరిణామాల పట్ల మరింత జాగ్రత్త అవసరమైన కాలం మళ్లీ వచ్చింది. మన అస్తిత్వానికి కొత్త ఆటంకాలు సృష్టిస్తూనే ఉన్నారు. తెలంగాణ కవి ఉద్యమ స్పృహతో పునరుత్థానం చెందవలసిన సందర్భం మళ్లీ ఆసన్నమవుతున్నది.

నేను పోపు పెడితే..



రమాయణం

మా ఊర్లో వంట అయ్యగార్ల ఇళ్లు పెద్దగా లేవు. ఉన్న ఒకటి రెండు ఇళ్లల్లో మగవాళ్లు చదువుకొని ఉద్యోగాలు చేసేవాళ్లు లేదా వైష్ణవ ఆలయాల్లో పూజారులుగా ఉండేవాళ్లు. వాళ్లకు వ్యవసాయ భూములూ, మంచి ఇళ్లూ ఉండడంతో బయటివాళ్ల కోసం వంటలు చేయాల్సిన అవసరం ఉండేది కాదు. బమ్మెరలో ఎప్పుడూ వంటకూ, టిఫిన్లు చేయడానికి కూడా అయ్యగార్లు ఉండేవారు. ఆడవాళ్లకు పెద్దగా పని ఉండేది కాదు.నానమ్మ వాళ్ల ఊరు కూనూరులో అయిదారు అయ్యగార్ల ఇళ్లు ఉండేవి. అయ్యగార్లంటే మరెవరో కారు, తమిళనాడులో అయ్యంగార్లనే ఇక్కడలా అంటారని అమ్మ చెప్పింది. రామానుజాచార్య ప్రభావం వల్ల వైష్ణవం వ్యాపించి శ్రీరంగం, తిరుమల, భద్రాచలం, యాదగిరి గుట్ట లాంటి వైష్ణవ క్షేత్రాల్లో రామానుజ సంప్రదాయంలోనే ఆరాధనలు, పర్వదినాలు జరిపేవారు. ఈ అయ్యగార్లలో కొందరు పూజారులుగా, మరి కొంతమంది వంటలవాళ్లుగా ఉండేవారు. వీళ్లలో చాలా మంది కనీసం రోజూ తిండి దొరకడమే కష్టంగా గడిపేవాళ్లు. పేరుకే గొప్ప కులం కానీ .. చాలామందికి లాగానే వాళ్లకు ఎలాంటి ఆదాయమూ లేకపోయేది. గూనపెంకుల పాత ఇళ్లు, ఎవరైనా వడ్లో, బియ్యమో ఇస్తే వాటికి జతగా పెరట్లో కాసిన ఆకుకూరలో, పాదులకు కాసిన కాయగూరలో వండుకుని తినేవారు. మా నాయనమ్మకు వంట చేయడం అంటే ఇష్టం ఉండేది కాదు. మిగతా పనులు ఎన్నైనా చేసేది గానీ వంటంటే చికాకు. 'రోజూ ఎవరన్న ఒండితే.. వాండ్ల కాళ్లు కడిగి నెత్తిల చల్లుకుంట' అనేది. అయితే.. ఆమెకు ఎప్పుడూ వంటకు ఓ అయ్యగారో, అమ్మగారో ఉండేవాళ్లు. ఎప్పుడైనా వాళ్ళల్లో ఎవరు లేకపోయినా ఆమె తెగ చిరాకుపడిపోయేది. అయ్యగార్ల కుటుంబాల్లో అండమ్మ గారు, భట్టర్ లక్ష్మయ్య గార్లది ఒక కుటుంబం. అండమ్మగారు రెండు మూడు రోజులకోసారి పొద్దున్నే ఇంటికి వచ్చి నాయనమ్మ దగ్గర చాయ్ తాగి, ఊరి మీద ముచ్చట్లన్నీ చెప్పేది. చూస్తూ ఉండగానే పదకొండు అయ్యేది. అప్పుడు అండమ్మగారు 'బియ్యం ఎక్కడున్నయి దొరసానీ! ఎసరు గిన్నె ఎక్కడున్నది?! కూరగాయలు ఎక్కడున్నయి?! ఏం ఒండాలే?!' అని అడిగేది. మా నాయనమ్మ లోపల్లోపల ఎగిరి గంతేసినా, 'ఏహె! ఎందుకు తియ్యమ్మ , నేను ఒండుకుంట' అనేది. 'అయ్యో , గదేందమ్మా ! నేను ఉండంగ మీరు ఒండుకునుడు ఏంది?! ఏందో మాట్లాడుకుంటు ఉంటె పదకొండాయె. ఇంత ఒండి మీకింత పెడ్త' అనేది. మా నాయనమ్మకు కావాల్సింది కూడా అదే! సాయంత్రం దాకా ఉండి అప్పుడు కూడా చాయ్ తాగి 'గిన్ని పెసళ్లు పెట్టరాదమ్మా %రి% పండినట్టున్నయి గద! గా ఆనిగెపు కాయ ఒకటిస్తె ఒండుకుంటం' అని ఎన్నో నిత్యావసర వస్తువుల్ని పట్టుకుపోయేది. నాయనమ్మ కూడా 'పాపం, ఏదో అడుగుతున్నది. ఇస్తె ఏం బాయె' అంటూ తాతయ్యకు తెలియకుండా ఇంట్లో ఉన్న ధాన్యమో, కూరగాయలో, ఏవైనా వస్తువులో ఇస్తూ ఉండేది. ఆ విధంగా నెలలో సగం రోజులు అండమ్మ గారు రావడం, వంటలు చేయడం జరిగేది. ఆ తరువాత కొన్నాళ్లకు అండమ్మ గారు, ఆమె భర్త మా ఊరి మీదుగా ఏదో ఊరికి వెళ్తూనో, వస్తూనో మా ఇంటికి వచ్చేవాళ్ళు. అలా వచ్చినవాళ్లు వారం, పది రోజులు ఉండటం ఒక్కోసారి నెలకు పైగా ఉండటం మాకు అలవాటయిపోయింది. ఒక్కోసారి లక్ష్మయ్య గారూ, మరోసారి అండమ్మ గారూ ఒక్కరే వచ్చేవారు. అయితే ఇద్దరూ వచ్చినప్పుడే ఉండేది అసలు కథ. వాళ్లిద్దరికీ క్షణం పడేది కాదు. ఏదో చిన్న విషయం మీద మొదలై ఒకళ్లనొకళ్లు తిట్టుకునేవాళ్లు.'మీ ఇంట్లనే గింత, మీ వంశమే గింత! గయ్యాళి కొంపనించి పిల్ల ఒద్దన్నా మా ఓండ్లు ఇనలే!' అనేవాడాయన. 'ఆఁ నీకెవ్వడో పిల్లనిచ్చిను! ఏండ్లు ఒచ్చి ముదిరిపోతె మీ నాయనమ్మ మా ఓండ్లను బతిలాడితె ఏదో పోనియ్యని ఇచ్చిను. నాకంటె ఏడేండ్లు పెద్ద, కోతి మూతి మొకపోనికి ఎవరిద్దురు?! నా కుతికె కోసిను!' అని ఆవిడ మొదలుపెట్టేది. 'నీ బొంద! మీ నాయినకు ఆడి సంతానం, పెండ్లిండ్లు జెయ్యలేక తిప్పలబడుతుంటె ఏదో మర్యాద, పెద్ద మనిషి, ఇల్లు దోసుకొని ఒచ్చిందని చేసుకున్నం. గింతపాటి ఎత్తు పండ్ల రంభ మాకు దొరుకక పోవునా?!' అనేవాడు అయ్యగారు ఉక్రోషంగా. దాంతో గొడవ ఇక పరాకాష్ఠకు చేరుకునేది. ఆయన తోడబుట్టిన వాళ్లు, తల్లిదండ్రులు, పూర్వికులు కూడా ఆవిడ తాలూకూ తిట్ల నుండి తప్పించుకోలేక పోయేవారు. ఆయనా అంతే కాకపోతే ఆమెను మాత్రమే తిట్టేవాడు. ఈ లోగా అమ్మ ఇద్దరికీ రెండోసారి చాయ్ ఇచ్చి 'ఏమి లొల్లి ?! అందరు ఇంటున్నరు, ఇగ బంజేయండి. అయ్యగారూ! మీరన్న ఊరుకోండి!' అనగానే గొడవ ఆపేసేవారు. కాసేపటికి ఆయనే తొందరగా స్నానం చేసి 'ఇగ ఏం ఒండాల్నో చెప్పండమ్మా!' అమ్మతో అని, వంట మొదలుపెడుతూ 'గా కూరగాయలన్న కోసియ్య రాదూ, జిడ్డు తీరుగ కూచోకపోతె! స్థానం (స్నానం) లేదు, ఏమి లేదు, నీకైతె చెడ చాదస్తం (బద్ధకం) అయ్యింది' అని భార్యను అనేవాడు. ఇక మళ్లీ గొడవ మొదలయ్యేది. 'ఉడుకుడుకు నీళ్లన్ని నువ్వే చేస్తివి, నేనెప్పుడు జెయ్యాలె?! అయినా నేను ఒండుత తియ్యి. నువ్వు ఇంతలకు కూరగాయలు గొయ్యి. అయినా, నేను జేసినంత బాగ నువ్వు జేస్తవా ఒంట! గా తోటకూర తెంపు, బొగ్గుల పొయ్యి మీద పప్పేస్త, చామగడ్డ అంటు పులుసు జేసి, దోసకాయ తొక్కు నూరుత. ఎంతల ఐతది?! నేను పోపు పెట్టిన్నంటె ఊరంత గుప్పుమనాలె !' అనేది అండమ్మగారు. 'నీ పాడె ఒంట ఒండినవు తియ్యి' అంటూ ఆయన విసుక్కుని ఇప్పటి వాళ్లు మాటిమాటికీ' డియర్, డాలింగ్ అనే పదాలు వాడినట్టుగా 'నీ బొంద, నీ పాడె' అంటూ ఆమెను తిట్టేవాడు. అది మరో ఇరాన్, ఇరాక్ యుద్ధంలా అలా సాగుతూనే ఉండేది. వాళ్లిద్దరూ సామరస్యంగా నవ్వుకుంటూ మాట్లాడుకోవడం నేనెప్పుడూ చూడలేదు. వీళ్ల భార్యాభర్తల్లా, శత్రువులా అనిపించేది. ఏమాటకామాటే చెప్పాలి, ఇద్దరూ బాగా వంట చేసేవాళ్లే!! ఆ రుచి ఇప్పటికీ మర్చిపోలేం!!